




అరుణోదయ నాగన్నకు పురస్కారాన్ని అందజేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక. చిత్రంలో సుద్దాల అశోక్ తేజ

## నిజమైన ప్రజాకవి సుద్దాల హనుమంతు

కొనియాడిన పలువురు వక్తలు

అరుణోదయ నాగన్నకు 'సుద్దాల' జాతీయ పురస్కారం ప్రదానం

చిక్కడపల్లి, అక్టోబర్ 19: జీవిత పర్యంతం వస్తువులే ఆస్తిపాస్తులుగా నమ్మిన నిజమైన ప్రజాకవి సుద్దాల హనుమంతు అని పలువురు వక్తలు కొనియాడారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం సుద్దాల హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ప్రముఖ కళాకారుడు అరుణోదయ నాగన్నకు సుద్దాల హనుమంతు - జానకమ్మ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక మాట్లాడుతూ నాగన్న గొప్ప గాయకుడని కొనియాడారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ నాగన్న 50 ఏండ్లుగా ప్రజాపాటలే ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా రాజీపడని పాటకు వెయ్యేళ్లని నమ్మిన వ్యకి అని పేర్కొన్నారు.

## రెండున్నర కిలోల బంగారం స్వాహా!

మణప్పురం గోల్డ్ లోన్ మేనేజర్ తస్కరణ?

వికారాబాద్, అక్టోబర్ 19 : రెండున్నర కిలోల బంగారంతో మణప్పురం గోల్డ్ లోన్ మేనేజర్ పరారైన ఘటన వికారాబాద్‌లో చోటుచేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం... గోల్డ్ లోన్ డబ్బులు తిరిగి కట్టి బంగారాన్ని విడిపించుకొని వెళ్లాలనుకున్న వారిని గత రెండు రోజులుగా తిప్పి పంపిస్తున్నారు. గట్టిగా నిలదీయడంతో రెండున్నర కిలోల బంగారం మేనేజర్ విశాల్ ఎత్తుకెళ్లినట్టు బాధితులకు తెలిసింది. ఈ మేరకు పోలీసులు ఫిర్యాదు చేశారు.

## యూట్యూబర్లు బ్లాక్‌మెయిల్ చేశారు

నగల వ్యాపారి రమణ్‌లాల్ ఆరోపణ

ఖైరతాబాద్, అక్టోబర్ 19: కొంతమంది యూట్యూబర్లు తనను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు వసూలు చేశారని కాప్రాలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన నగల వ్యాపారి గుడివాడ రమణ్‌లాల్ ఆరోపించారు. వారి వేధింపులు తాళలేక పోలీసులను ఆశ్రయించినట్టు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రమణ్‌లాల్ వివరాలు వెల్లడించారు. 30ఏండ్లుగా బంగారం, రత్నాల వ్యాపారంతోపాటు ఏఎస్‌రావు నగర్‌లో అదృష్ట జువెల్లర్స్ పేరిట షాపును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆగస్టు 3న హిందూ చానల్స్ ప్రతినిధులమంటూ యూట్యూబర్లు డీ శివప్రసాద్(భారత్ వర్ష), లలిత కుమార్(హిందూ జనశక్తి), హరికృష్ణ(ఏది నిజం) తనను కలిసి, రత్నాల పేరిట ప్రజలను మోసం చేస్తున్నావంటూ ఆరోపణలు చేస్తూ తనపై వీడియోలు రూపొందిస్తామని బెదిరించినట్లు వెల్లడించారు. డబ్బులు డిమాండ్ చేయగా రూ.1.50లక్షల వరకు ఇచ్చానని, మళ్లీ గత నెల 23న రూ.60లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని వివరించారు. దీంతో కుషాయిగూడ పోలీసులను ఆశ్రయించగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. తన నుంచి వసూలు చేసిన రూ.1.50లక్షలు తిరిగి ఇప్పించాలని, వాటిని నిస్వార్థంగా పనిచేస్తున్న హిందుత్వ సంస్థలకు అప్పగిస్తానని రమణ్‌లాల్ స్పష్టం చేశారు.

## తెలంగాణలో రైల్వే స్టేషన్ల అభివృద్ధికి 1830.4 కోట్లు

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో అమృత్‌భారత్ స్టేషన్ స్కీమ్‌లో భాగంగా తెలంగాణలో 38 స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని రైల్వే అధికారులు శనివారం వెల్లడించారు. ఈ స్టేషన్ల అభివృద్ధి కోసం రూ.1830.4 కోట్లు కేటాయించినట్టు ప్రకటించారు. రూ.430 కోట్లతో చర్లపల్లి రైల్వే టర్మినల్, సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనులకు రూ.700 కోట్లు, హైదరాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం రూ.309 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. మిగితా స్టేషన్లకు అవసరాల మేరకు నిధులు కేటాయించినట్టు తెలిపారు.



















